
ప్రజాశక్తి



అథ్లెటిక్స్ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజ్జి స్టేడియంలో జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ జట్టు ఎంపికను ఆదివారం చేపట్టారు. ఈ ఎంపికలకు 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ పి.సీతారామరాజు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఐ.వి.పి.రాజు పోటీలను ప్రారంభించారు. ఎంపికలకు టెక్నికల్ ఆఫీషియల్‌గా జిల్లా అథ్లెటిక్ సంఘ సభ్యులు, సీనియర్ అథ్లెట్లు, వ్యాయామ ఉపాధ్యాయులు వ్యవహరించారు.



పరుగు పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

అందని నీరు.. ఎండుతున్న నారు

- ఎండలు మండిపోవడంతో ఎండిపోతున్న నారుమళ్లు
- సాగునీరందక రైతుల ఇక్కట్లు
- తోటపల్లి శివారు భూములకు నీరేది?



చిన్నరాజులగుమ్మడలో నీరు లేక నారుమడి పూర్తిగా ఎండిపోయిందని చూపిస్తున్న రైతు ద్వారపురెడ్డి ప్రభాకరరావు

ప్రజాశక్తి - వంగర

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు పూర్తిగా గడిచిపోయాయి. అయినా పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన పాత కాలువ ద్వారా నేటి వరకు వంగర మండలంలోని చిన రాజుల గుమ్మడ, పెద్ద రాజుల గుమ్మడ, తలగాం, వంగర, శివ్వాం తదితర గ్రామాల్లోని పొలాలకు సాగునీరు అందలేదు. దీంతో రైతులు ఇక్కట్లు పడుతున్నారు. గత కొన్నాళ్లుగా వర్షాలు కూడా కురవకపోవడం, శివారు భూములకు సాగునీరు అందకపోవడంతో వరి నారుమళ్లు ప్రస్తుతం ఎండిపోతున్నాయి. చివరి తడి కోసం రైతులు అగచాట్లు పడుతున్నారు. ఉన్న నారుమడులు కూడా నీరందక, వయస్సు మీరి ముదురుపోతున్న పరిస్థితి. ఆగస్టు నెల ఆరంభమైనా సాగునీరు అందక ఇంతవరకు కూడా రైతులు.. తమ తమ పొలాల్లో దమ్ములు చేపట్టకపోవడం, వరినాట్లు వేయకపోవడంతో ఈ ఏడాది వరి నాట్లు వేయగలమా? లేదా? అని ఆందోళన చెందుతున్నారు. ఈ రెండు, మూడు రోజుల్లో నారు మడులకు తడి అందకపోతే పూర్తిగా చనిపోతాయని, చివరి తడి అయినా తమ పొలాలకు అందించాలని రైతులు కోరుతున్నారు.

సాగునీటి అధికారుల జాడెక్కడ

సాగునీరు అందక మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు గగ్గోలు పెడుతుంటే దానికి సంబంధించిన అధికారులు మాత్రం ఇంతవరకు ఎక్కడున్నారో తెలియని పరిస్థితి. దీంతో రైతులు తమ గోడును ఎవరితో చెప్పుకోవాలో తెలియక దిక్కుతో చని స్థితిలో ఉన్నారు. మోటార్లుతోనైనా నీరు తోడి వరినారు తడపుదామంటే చెరువుల్లో కూడా నీరు లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీరు అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరు అందించేందుకు చర్యలు

తోటపల్లి కుడి ప్రధాన పాత కాలువ ఆయకట్టులో ఉన్న వంగర మండలంలోని కొప్పరవలస గ్రామం వరకు సాగునీరు ప్రస్తుతం వస్తుంది. మిగతా గ్రామాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

- దేవర వెంకటరమణ, ఎఇ, కుడి ప్రధాన పాత కాలువ, తోటపల్లి ప్రాజెక్టు

ఎవరూ పట్టించుకోవడం లేదు



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. ఇంతవరకు సాగునీరు రాలేదు. వరినారు పూర్తిగా ఎండి పోతుంది. ఎవరూ పట్టించు కోవడం లేదు. కొంతమంది రైతులు మాత్రం బోరు నీటితో కష్టపడి వరినాట్లు వేసుకుంటున్నారు.

- యలగాడ రాజారావు, రైతు, చినరాజులగుమ్మడ

సాగునీటి కోసం ఎదురు చూస్తున్నాం



నాకు ఎకరన్నర పొలం ఉంది. మా పొలం వైపు కాలువ కూడా బాగు చేశారు. కానీ ఎగువ ప్రాంతం నుండి నీరు రావటం లేదు. చాలా ఇబ్బంది పడుతున్నాం. 9/9 ఛానల్ నుండి సాగునీరు ఎప్పుడు అందిస్తారని ఎదురు చూస్తున్నాం. పోని నారు మడి తడుపుకుందామంటే మాకు బోరు కూడా లేదు. అధికారులే స్పందించి శివారు భూములకు సాగునీటిని అందించాలి.

- ఆలుబిల్లి సింహాచలం, రైతు, పెద్దరాజులగుమ్మడ



ప్రహరీగోడను ప్రారంభిస్తున్న మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్

విద్యకు ఎనలేని ప్రాధాన్యత

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-పూసపాటిరేగ

విద్యారంగానికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని నడిపిల్లి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో నిర్మించిన నూతన తరగతి గదులను, పాఠశాల ప్రహరీ గోడను ఆదివారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనితతో కలిసి ఆయన ప్రారంభించారు. కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం సిఎస్ఆర్ నిధులు రూ.18.50 లక్షలతో తరగతి గదులను, ఉపాధి హామీ నిధులు రూ.9.48 లక్షలతో ప్రహరీ గోడను నిర్మించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థను మెరుగుపరుస్తూ భవిష్యత్ తరాలకు మరిన్ని అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని అన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ 20 ఏళ్లపాటు కూటమి పాలన సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం అన్ని పక్షాలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని సూచించారు.

ఇటీవల జాతీయ, రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన గుంపాం పాఠశాల విద్యార్థులను మంత్రి ఈ సందర్భంగా అభినందించి, పతకాలను, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, డిఇఒ మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ రామారావు, సర్పంచ్ గాయిత్రి పాల్గొన్నారు.

నేడు జర్నలిస్టుల డిమాండ్స్ డే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం విజయనగరంలో డిమాండ్స్ డేను నిర్వహిస్తున్నట్లు ఎపిడబ్ల్యుజెఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో వద్ద జర్నలిస్టుల ఇంటి స్థలాల కేటాయింపు, పెన్షన్ చెల్లింపు, అక్రిడిటేషన్ల జారీకి వీలుగా కొత్త జిఒ తీసుకురావడం, మీడియాలోని ప్రస్తుత పరిస్థితిని అధ్యయనం చేసేందుకు వీలుగా మీడియా కమిషన్ ఏర్పాటు, జర్నలిస్టుల అవార్డులను ప్రదానం చేయడం, రాష్ట్ర కేంద్రంలో వృద్ధ జర్నలిస్టుల కోసం ఓల్డేజ్ హోం నిర్మాణం తదితర అంశాలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి, అనంతరం కలెక్టర్‌కు వినతి అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలపై

5 నుంచి 16 వరకు పోరాటాలు : ఎపిజిఇఎ

ప్రజాశక్తివిజయనగరం టౌన్

ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఈ నెల ఐదు నుంచి 16వ తేది వరకు వివిధ రూపాల్లో పోరాటాలు చేపడుతున్నట్లు ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు కంది వెంకటరమణ తెలిపారు. ఆదివారం ఎపిజిఇఎ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు అనేక హామీలు ఇచ్చిందని, అయితే ఏ ఒక్క సమస్య పరిష్కారానికీ ముందుకు రాలేదని చెప్పారు. పిఆర్‌సి ప్రకటించాలని, ఐఆర్, డిఎలు విడుదల చేయాలని, పిఎఫ్, జిఎల్ఐ బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం.. అనే పేరుతో కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే లక్ష్యంగా పోరాటాలు సాగిస్తామన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరావు, సహాయ కార్యదర్శులు జి.లక్ష్మీనాయుడు, పి.మేరీ, ఎస్.సూర్యనారాయణ, పి.వెంకటరమణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారా జూనియర్, సబ్ జూనియర్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్ కోరారు. ఆదివారం నగరంలో సారథి వెల్ఫేర్ అసోసియేషన్ బ్లైండ్ స్కూల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి 135 మంది పారా క్రీడాకారులు పాల్గొన్నారని, 47 మంది రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని ఆయన అన్నారు. కార్యక్రమంలో సారథి వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు ప్రదీప్, అమ్మ సేవా సంఘం వ్యవస్థాపకులు లక్కీ శేఖర్, మహేష్, కిరణ్ కుమార్, శర్మ, వెంకటరావు పాల్గొన్నారు.

డైరెక్టర్ పదవులకు రాజీనామా

ప్రాధాన్యత ఇవ్వడం లేదని జనసేన నాయకుల ఆవేదన

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్



రాజీనామా లేఖను అందజేస్తున్న జనసేన నాయకులు

కూటమి ప్రభుత్వంలో తమకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని జనసేన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గజపతినగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఎఎంసి డైరెక్టర్లు కలిగి స్వాతి, పైల మహేష్, కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ కడమల అప్పయ్యమ్మ, శ్రీను తమ పదవులకు రాజీనామా చేశారు. నియోజకవర్గ స్థాయిలో, అటు మండలంలో జరిగే కార్యక్రమాల్లో తమకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదని వారు తెలిపారు. తమతోపాటు జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మర్రాపు సురేష్‌కు ప్రోటో కాల్ పాటించకుండా అవమాన పరుస్తున్నారని తెలిపారు. అందుకే రాజీనామా చేశామని వారు ప్రకటించారు.



మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి సుధారాణి

ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా లక్ష్మి, సుధారాణి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గా మంగ లక్ష్మి, బి.సుధారాణి, కోశాధికారిగా స్వప్న ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ఎన్‌పిఆర్ భవనంలో ఎం.లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఆ సంఘం జిల్లా మహాసభలో 30 మందితో నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎండిఎం నిర్వాహకులను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని, ప్రతి నెలా ఐదో తేదిలోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్‌చేశారు. మెనూ ఛార్జీ రూ.20 ఇవ్వాలని, ధరల పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. గుర్తింపు కార్డులు, వంట పాత్రలు ఇవ్వాలన్నారు. గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, యూనిఫాం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించవద్దని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ డిమాండ్లపై మహాసభ తీర్మానాలు చేసింది. మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.శంకరరావు, కె.సురేష్, నాయకులు ఎ.జగన్మోహనరావు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

సాగు భూములు లాక్కోవడం అన్యాయం

ప్రభుత్వంపై సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆగ్రహం

ప్రజాశక్తి-రామభద్రపురం



గిరిజనులతో కలిసి నిరసన చేపడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

దశాబ్దాలుగా గిరిజనుల సాగులో ఉన్న భూములు లాక్కొని, ఎంఎస్ఎంఇ పార్కు నిర్మాణం పేరుతో వారిపై దౌర్జన్యాలు చేయడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ.. ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం మండలంలోని కాకర్లవలస, కారేడువలస గ్రామ గిరిజనులతో స్థానిక సిపిఎం నాయకులు బి.శ్రీనివాసరావుతో కలిసి చర్చించారు. గ్రామానికి దగ్గరలో ఉన్న భూములకు బదులుగా గిరిశిఖర ప్రాంత భూముల్లో సాగు చేసుకోవాలని రిజర్వ్ ఫారెస్ట్ భూముల కేటాయింపు చేస్తామనడం దారుణమని తమ్మినేని మండిపడ్డారు. 2017లో ఇక్కడ భూములు కొనుగోలు చేసిన ఎపిఐఐసి.. ఇప్పటివరకు అభివృద్ధి చేయలేదని, 2013 భూసేకరణ చట్టం అనుసరించి తిరిగి ఆ భూములను గిరిజనులకు అప్పజెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టంచేశారు. దీన్ని రెవెన్యూ యంత్రాంగం గుర్తించి గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం దిగొచ్చే వరకు పోరాడాలని, గిరిజనులకు అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, బాధిత గిరిజనులు పాల్గొన్నారు.

కిరండోల్ రైల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కిరండోల్ ప్యాసింజర్‌లో ఈగల్, సివిల్, జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ పోలీసులు శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శృంగవరపుకోట నుంచి కొత్తవలస వెళ్తుండగా రైల్లో డాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీలు చేశారు. ఒడిశా నుంచి రైళ్ల ద్వారా ఇతర ప్రాంతాలకు గంజాయి రవాణా అవుతోందన్న సమాచారంతో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఏడున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. ముందుగా ప్రయాణికులతో వ్యవహరించాల్సిన తీరు గురించి విజయనగరం డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, ఎస్.కోట సిఐ నారాయణ మూర్తి.. పోలీసు సిబ్బందికి, అధికారులకు దిశానిర్దేశం చేశారు.



రైల్లో తనిఖీలు చేపడుతున్న డాగ్ స్క్వాడ్



మాట్లాడుతున్న ప్రజావేదిక నాయకులు రెడ్డి శంకరరావు

స్మార్ట్‌మీటర్లు రద్దుచేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


అదానీ స్మార్ట్‌మీటర్లు, ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని ప్రజావేదిక నాయకులు రెడ్డి శంకరరావు డిమాండ్‌చేశారు. ఈ డిమాండ్లపై ఈ నెల 5న విద్యుత్తు కార్యాలయాల వద్ద చేపట్టే ధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. ఆదివారం గురజాడ నగర్‌లో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ అధ్యక్షతన జరిగిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి 14 నెలల కాలంలో 18,600 కోట్లు విద్యుత్ భారం వేశారని విమర్శించారు. ఇప్పుడు మరోసారి 1200 కోట్లు భారాలు వేసేందుకు సిద్ధమవుతున్నారని దుయ్యబట్టారు. మరోవైపు అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఇళ్లకు వస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్మార్ట్‌మీటర్ ఏర్పాటుకు ఇళ్లకు వస్తే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కూటమి నేతలు ఎన్నికల ముందు ఒక మాట, అధికారం వచ్చాక మరో మాట మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ భారం మోయలేక పోతున్నామని, అదానీ స్మార్ట్ మీటర్ బిగిస్తే ముందే వేలాది రూపాయలు రీఛార్జ్ చేసుకుని, భారీగా బిల్లు వస్తే భరించలేమంటూ వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రంభ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల దరఖాస్తులు.. నిరంతర ప్రక్రియ

- ఇళ్ల కోసం 36,541 అర్జీలు
- వచ్చే ఏడాది మార్చికి నిర్మాణాలన్నీ పూర్తిచేయాలి
- 'ప్రజాశక్తి'తో హౌసింగ్ పీడీ మురళీమోహన్ ముఖాముఖి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

'జిల్లాలో ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తులు చేసుకోవచ్చు. ప్రతి సచివాలయంలోనే దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఇల్లు మంజూరు చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కూటమి ప్రభుత్వ హయాంలో ఇంతవరకు 36,541 దరఖాస్తులు వచ్చాయి. ఇళ్ల నిర్మాణం కోసం 2019-2024 వరకు రూ.947 కోట్లు ఖర్చు చేశాం. గత ప్రభుత్వంలో 81,999 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు ఇళ్ల నిర్మాణం కోసం అదనంగా ప్రభుత్వం డబ్బులు కేటాయించింది' అని గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ గండి మురళీమోహన్ తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...



ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చా.?

జిల్లాలో అర్హులైన ప్రతిఒక్కరూ ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి సచివాలయంలో తమ పూర్తి వివరాలతో దరఖాస్తు అందించాలి. సొంత స్థలం ఉండి ల్యాండ్ పొజిషన్ డాక్యుమెంట్, కుల, ఆదాయ పత్రాలు, బ్యాంకు అకౌంటు, ఆధార్ కార్డు ఉండాలి. ఇలా దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తాం.

2019-24 మధ్యలో జిల్లాలో ఎన్ని ఇళ్లు మంజూరు చేశారు.? ఎన్ని నిర్మాణం చేపట్టారు.?

2019-24లో 81,999 ఇళ్లు మంజూరు చేశాం. 49,055 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశాం. ఇంకా 22,031 ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి. స్లాబ్ స్థాయిలో 2084, లెంటల్ స్థాయిలో 1316, పునాదుల స్థాయిలో 9652, పునాదుల కంటే దిగువ స్థాయిలో 8759 ఉన్నాయి. ఇంకా ప్రారంభం కాని ఇళ్లు 9499 రద్దు చేశాం.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.? ఎన్ని మంజూరు చేశారు.?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2.0లో ఇళ్ల మంజూరుకు 36,541 దరఖాస్తులు వచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో 34,782, పట్టణ ప్రాంతాల్లో 1754 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 1019 ఇళ్ల మంజూరుకు ఉత్తర్వులు వచ్చాయి. ఈ ఇళ్లను 2026 మార్చి 31లోగా పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కూటమి ప్రభుత్వంలో ఎస్‌సిలకు 50 వేలు, బిసిలకు రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ.70 వేలు అదనంగా నిర్మాణాలకు పెంచింది.



ఇళ్ల స్థలాల కోసం ఎంతమంది దరఖాస్తులు చేసుకున్నారు.?

జిల్లాలో 5711 మంది ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ రెవెన్యూ, హౌసింగ్ సంయుక్తంగా స్థలాల పరిశీలన చేస్తున్నాయి. గతంలో ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన కాలనీలో మిగిలి ఉన్న స్థలాల్లో కూడా వీరికి మంజూరు చేస్తాం. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల భూమి ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఇస్తుంది.

జిల్లాలో ఎన్ని హౌసింగ్ కాలనీలు ఉన్నాయి.? వాటిలో మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయి.?

జిల్లాలో 640 హౌసింగ్ లేఅవుట్లు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా విజయనగరం మండలం గుంకలాం, కొండకరకాం, బొబ్బిలి, శృంగవరపుకోటలో ఉన్నవి చాలా పెద్ద లేఅవుట్లు. మిగతావన్నీ చిన్న చిన్న లేఅవుట్లు. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలకు భూసేకరణ, ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయన్న విషయంపై విచారణ సాగుతోంది. రెవెన్యూ, హౌసింగ్ అధికారులు విచారణ చేస్తున్నారు.

గృహ నిర్మాణ సంస్థలో అధికారులు, సిబ్బంది కొరత ఏమైనా ఉందా.?

జిల్లాలో డిఇలు ఏడుగురికి గాను ఆరుగురే ఉన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిపి 33 మంది ఎఇలకు గాను 31 మంది ఉన్నారు. ఇన్‌స్పెక్టర్లు మండలానికి ఇద్దరు చొప్పున ఉండాలి కానీ కొంత కొరత ఉంది. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాగానే, కొరతను ప్రభుత్వం భర్తీ చేస్తుంది.



తనిఖీ చేస్తున్న వైద్యుడు బుజ్జి వర్మ

పాతబగ్గాంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

మండలంలోని పాతబగ్గాంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సచివాలయంలో బాలాజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ పూసపాటి బుజ్జి వర్మ పర్యవేక్షణలో 200 మంది గ్రామస్తులకు ఒపి నమోదు చేసి, 50 మందికి రక్త పరీక్షలు, ఉచిత వైద్య పరీక్షలు నిర్మించామని తెలిపారు. పలు ఆరోగ్య సూచనలు చేసి షుగర్, బిపి, జ్వరాలు ఉన్న వారికి ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లెంక పద్మావతి, సంగంరెడ్డి సత్యనారాయణ, ఆర్ఎంపి రామునాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు ప్రవేశాలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికలు వసతి గృహంలో ఐదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఖాళీగా ఉన్న సీట్లలో సోమవారం ప్రవేశాలకు అవకాశం కల్పించామని ప్రిన్సిపాల్ టి. జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.


కార్మికులతో మాట్లాడుతున్న రామారావు

అప్పారావు.. కార్మిక పక్షపాతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రిటైర్డ్ జ్యూట్ కార్మికుడు, శ్రామిక సంఘం మాజీ అధ్యక్షుడు కీర్తి శేషులు పతివాడ అప్పారావు కార్మిక పక్షపాతి అని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద అనారోగ్యంతో మృతి చెందిన పతివాడ అప్పారావుకి సంతాపం వ్యక్తం చేస్తూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కార్మిక నేత పతివాడ అప్పారావు కార్మిక పక్షాన నిలిచి సమస్యలు పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేశారు. ముఖ్యంగా జ్యూట్ యాజమాన్యం కార్మికులు నుంచి అప్పుగా తీసుకున్న 5,10, 18 రూపాయలు జీతం కోత నిలుపుదల చేసిన ఘనత అప్పారావుకే దక్కుతుందన్నారు. ఒకానొక దశలో యాజమాన్యాన్ని ఎదిరించి కార్మికుల పక్షాన నిలిచారని కొనియాడారు. కార్మిక వర్గానికి అప్పారావు లేని లోటు పూడ్చలేనిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన తదితరులు

తెలుగు భాషను ఆదరించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

తెలుగు భాషను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. స్థానిక ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ఆదివారం చింతా రమణ మాస్టర్ రచించిన తేట తెలుగు శతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష తెలుగును ఆదరించాలని కోరారు. తెలుగు భాష ప్రాముఖ్యతను చెప్పేందుకు పుస్తకం ఎంతో దోహదం చేస్తుందని చింతా రమణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా భూలోకమ్మ పండగ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బల్లంకిలో ఖరీఫ్ వరినాట్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భూలోకమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులందరూ భక్తి భావంతో ఆలయానికి చేరుకొని పంటలు బాగా పండి గ్రామ ప్రజలు పశువులు సుఖంగా ఉండే విధంగా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నారు.

సమరశీల పోరాటాలతోనే హక్కుల సాధన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సమరశీల పోరాటాలతోనే హక్కులను సాధించుకోవచ్చునని ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక అమరవీరుల స్మారక భవన్‌లో రెండో రోజు క్లాసులు నిర్వహించారు. దేశంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న పరిస్థితులను సోదాహరణంగా వెంకటేశ్వర్లు వివరించారు. అన్ని రకాల కార్మికులు దేశంలో హక్కులు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల జ్యూట్‌మిల్ కార్మిక సంఘం అధ్యక్షులు నామాల తిరుపతిరావు, బి గీత తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐదుగురు సభ్యులు మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. గతంలో ఉన్న సభ్యులే ప్రస్తుత ఎన్నికల్లో నామినేషన్ వేశారు. దీంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రకటించారు. ఎస్‌వివి రాజేశ్వరరావు, అల్లు చాణిక్య, జివి రంగారావు, సుంకరి నారాయణస్వామి, రేగాన రూపా దేవి స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

వివాహానికి చేయూత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదింటి యువతి వివాహానికి ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్ చేయూతనిచ్చింది. ఆదివారం సంఘం కార్యాలయంలో వికలాంగుడైన సుగ్గు జగన్నాథం కుమార్తె పావని వివాహం కోసం రూ.35 వేలతో శతమానం, కాసు, తదితర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఆలవెల్లి శేఖర్, కార్యదర్శి డిమ్స్ రాజు, కోశాధికారి సముద్రాల నాగరాజు, మాచర్ల చంద్రశేఖర్ గుప్త, ఎ.వి.కృష్ణారావు, బండి వెంకట కామేశ్వరరావు, చెన్నా బుచ్చి జనార్దనరావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలోని శ్రీరామ కాలనీ, మండలంలోని మలిచర్ల, సుంకరిపేట గ్రామాల్లో ఆమె ప్రచారం చేశారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులపై కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల అధ్యక్షుడు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, నాయకులు తుమ్మగంటి రామారావు, కొసర శివ, పైడిరాజు, సుంకరిపేట మాజీ సర్పంచ్ సుంకరి రామునాయుడు, సుంకరి పైడిరాజు, సుంకరి సీతారాం, పాశి అప్పలనాయుడు, చెల్లూరు సర్పంచ్ కలిపిల్లి ఆదినారాయణ, ఎంపిటిసి బోడసింగి శంకర్రావు, కనకల రాంబాబు, రాజేష్ బాబు, మాజీ ఎంపిపి కంది సాయి జగ్గారావు పాల్గొన్నారు.

జిల్లాలో క్రీడాకారులు లేరట!

- పక్క జిల్లా వారికి ఇక్కడ అవకాశం
- భగ్గుమన్న తల్లిదండ్రులు, క్రీడాకారులు
- మంత్రి వద్దకు పంచాయితీ!
- క్రికెట్ ఎంపికలపై పలు అనుమానాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్రీడలకు పుట్టినిల్లుగా పేరుగాంచిన విజయనగరం జిల్లాలో క్రికెట్ ఆడేందుకు క్రీడాకారులే లేరట.. అందుకే విశాఖకు చెందిన క్రీడాకారులను ఇక్కడకు తీసుకొచ్చి ఎంపిక చేసి మన జిల్లా తరుపున ఆడించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సెలక్టర్లు చెబుతున్నారు. దీంతో జిల్లాకు చెందిన క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు భగ్గుమంటున్నారు. ఏళ్ల తరబడి జిల్లాలో క్రికెట్ ఆడుతున్న తమ పిల్లలను కాదని డబ్బు, పలుకుబడి ఉపయోగించి నిబంధనలకు విరుద్ధంగా పక్క జిల్లాకు చెందిన క్రీడాకారులను ఇక్కడకు తీసుకొచ్చి ఎంపిక చేయడమేంటని నిలదీస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు, క్రీడాకారులు, సెలక్టర్ల మధ్య వివాదం చెలరేగి అది కాస్త రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వరకూ చేరింది. ఆయన సమక్షంలోన పంచాయితీ కూడా నడిచినట్లు తెలిస్తోంది. ఆయన చొరవతోనైనా జిల్లా క్రీడాకారులకు న్యాయం జరుగుతోందేమోనని క్రీడాకారులు, తల్లిదండ్రులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో క్రికెట్ క్రీడాకారులు ఎంపికలో అడ్డగోలుగా, రూల్స్ పేరుతో జట్టులోకి విశాఖ జిల్లా క్రీడాకారులను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. దీంతో జిల్లా క్రీడాకారులకు అన్యాయం జరుగుతుందని తల్లి తండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటివల జరిగిన అండర్ 16 జట్టు ఎంపికలో 18 మందితో జట్టును సెలక్టర్లు ఎంపిక చేశారు. ఎంపిక చేసిన 18 మంది క్రీడాకారుల్లో 13 మంది వరకు విశాఖ జిల్లాకు చెందిన వారిని ఎంపిక చేశారు.


క్రీడాకారులను ఎంపిక చేస్తున్న సెలెక్టర్లు

వారిలో గతంలో విశాఖ జిల్లా తరుపున ఆడిన క్రీడాకారులు కూడా ఉన్నారు. కాగా జిల్లాలో ఉన్న జట్టును ఎంపిక చేసే సెలక్టర్లలో ఒకరు విశాఖ జిల్లాలో ఉన్న అకాడమీకి సహకరిస్తున్నట్లు తెలిస్తోంది. వాస్తవానికి పక్క జిల్లాకు చెందిన క్రీడాకారులు ఇక్కడ మూడేళ్లు చదివితే ఈ జిల్లా తరుపున ఎంపిక చేయవచ్చు. ప్రస్తుతం ఆ రకంగానే ఎంపిక చేసినట్లు సెలక్టర్లు చెబుతున్నా, వారు పెట్టినవి ఫేక్ సర్టిఫికేట్లు అని ఇక్కడ ఎవరూ చదవడం లేదని కేవలం పేరు మాత్రమే ఇక్కడ రన్ చేస్తున్నారని క్రీడాకారుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

మంత్రి వద్ద పంచాయితీ

జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఈ జిల్లాకు చెందిన క్రీడాకారులు నష్టపోతున్నారని క్రీడాకారుల తల్లిదండ్రులు ఇటీవల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వద్ద పంచాయితీ పెట్టారు. జిల్లా జట్టు 18 మందిలో కేవలం ఐదుగురు క్రీడాకారులే మన జిల్లాకు చెందిన వారని మిగిలిన వారు పక్కా జిల్లాకు చెందిన వారని ఆధారాలతో మంత్రికి వివరించినట్లు తెలిస్తోంది. వాస్తవానికి ఏ జిల్లాలో కూడా పక్క జిల్లా వారికి అవకాశం ఇచ్చే ఘటనలు చాలా తక్కువని, కేవలం మన జిల్లాలో ఇది చాలా ఎక్కువగా ఉందని మంత్రికి వివరించినట్లు సమాచారం. మన జిల్లా జట్టులో మన క్రీడాకారులకు అవకాశం ఇవ్వకుండా పక్కా జిల్లా వారికి ఇప్పటికే విశాఖ జిల్లా తరుపున ఆడిన వ్యక్తిని మరల మన జిల్లా నుంచి ఎంపిక చేయడం ఏంటని మంత్రి వద్ద ప్రశ్నించారు. జిల్లా వారికి ఎందుకు అన్యాయం చేస్తున్నారో తెలియడం లేదని, మంత్రి కలుగజేసుకుని న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరారు. వెంటనే స్పందించిన మంత్రి పరిశీలించి చర్యలు తీసుకుంటామని, మన క్రీడాకారులకు అన్యాయం జరిగితే ఉపేక్షించేది లేదని మంత్రి తల్లిదండ్రులకు హామీ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు మంత్రిని ఆశ్రయించడంతో జిల్లా క్రికెట్ అసోసియేషన్ నాయకులు మంత్రి ఏ విధంగా స్పందిస్తారోనని ఎదురు చూస్తున్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- గజపతినగరం రూరల్

విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు కోరుతూ ఆగస్టు 5న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి. శ్రీనివాస్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. లక్ష్మి కోరారు. స్మార్ట్ మీటర్లను తక్షణమే రద్దు చేయాలని, పెంచిన సర్దుబాటు ఛార్జీలను తగ్గించాలని ప్రజావేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రచార, ఆందోళన, పోరాటాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆదివారం మండలంలోని పాతబగ్గాం, భూదేవిపేట, మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల విషయంలో జగన్మోహన్ రెడ్డి ద్రోహం చేశాడని ప్రచారం చేసి అదానీ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, వాటిని బద్దల కొట్టాలని, ఎన్నికలకి ముందు నారా లోకేష్ పిలుపునిచ్చి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత స్మార్ట్ మీటర్లను ఎలా ప్రోత్సహిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే సర్దుబాటు ఛార్జీల పేరిట సుమారు రూ.17వేల కోట్లు భారం వేశారన్నారు. అదానీ చేతుల్లోకి కరెంటు వెళ్తే రాష్ట్రం అంధకారంలో నెట్టడం ఖాయమన్నారు. దీనికి వ్యతిరేకంగా ఈ నెల 5న గజపతినగరం కరెంట్ ఆఫీస్ వద్ద జరుగు ధర్నా కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు ఆర్. నాగేశ్వరరావు, సిఐటియు నాయకులు బి.కనకరాజు, కోటి, జి.సూర్యనారాయణ, రవి, కామమ్మ, సింహాచలం, పోలమ్మ, వెంకటి, ఈశ్వరరావు, శకుంతల, లీల, మంగ, పైడిరాజు, మీనాక్షి, కె.సింహాచలం, డి.వసంత, డి.శ్యామల, సిహెచ్. లచ్చమ్మ, సిహెచ్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.


గజపతినగరం: స్మార్ట్‌మీటర్లపై వివరిస్తున్న శ్రీనివాస్

శృంగవరపు కోట: అదాని స్మార్ట్ మీటర్లు వద్దే వద్దని కరపత్రాలు చూపుతూ పంచాయతీలోని ఒకటవ వార్డు గిరిజనులు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన నాయకుడు సీదరి అర్జున్ మాట్లాడుతూ అదాని కంపెనీలో తయారవుతున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు అదాని ఆదాయాన్ని పెంచేందుకు రూ.13 వేల నుండి 17వేల రూపాయలకు కొనుగోలు చేసి ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నారన్నారు. కేంద్రంలో మోడీ రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం అదానితో ఒప్పందం చేసుకుని రాష్ట్ర ప్రజలకు బలవంతంగా స్మార్ట్ మీటర్లను బిగించే పనిలో నిమగ్నం అయ్యారని దీనిని అప్పట్లో ప్రతిపక్షంగా ఉన్న టిడిపి, జనసేన పార్టీలు వ్యతిరేకించేయాని, నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండని పిలుపునిచ్చారని ఇప్పుడు కూటమి ప్రభుత్వం అదే స్మార్ట్ మీటర్లను బిగిస్తూ సర్ ఛార్జీలు పేరుతో అదనపు భారం మోపుతున్నారని చెప్పారు. చంద్రబాబు నాయుడు బషీరాబాద్ విద్యుత్ పోరాటాన్ని మరిచిపోయారేమో మళ్లీ అటువంటి పోరాటాన్ని చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గమ్మెల సన్యాసిరావు, సాంబ సుబ్బారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

కె స్క్వేర్‌తో సీతం ఒప్పందం

ప్రజాశక్తి-విజయనగరం

సీతం కళాశాల, కె స్క్వేర్ ఇన్ఫో మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. సీతం విద్యార్థులకు కె స్క్వేర్ ఇన్ఫో సంస్థ.. ఇంటర్న్‌షిప్, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ, విదేశీ విద్యలో మార్గనిర్దేశం చేయనుంది. ఈ మేరకు కె స్క్వేర్ ఇన్‌ఫో సంస్థ ఎమ్‌డి శ్రీధర్, సీతం కళాశాల ప్రిన్సిపల్ రామమూర్తి ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ కె స్క్వేర్ సంస్థతో ఒప్పందం వల్ల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగం ఉంటుందన్నారు.

శిథిలావస్థలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు

ప్రజాశక్తి - కంటోన్మెంట్(భోగాపురం)

భోగాపురం మండలంలోని రాజపులోవ వద్ద ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ భవనం శిథిలావస్థకు చేరింది. బ్యాంకకు వచ్చే ఖాతాదారులు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకకు వచ్చేందుకు బితుకు బితుకు మంటూ కాలం వెళ్ళ దీస్తున్నారు. రాజపులోవలో ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ప్రస్తుతం అద్దె కొంపలో నిర్వహిస్తున్నారు. ఇదీ కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఈ బ్యాంకులో సుమారు 15 వేల మంది ఖాతాదారులు లావాదేవీలు జరుపుతున్నారు. వర్షం పడితే ఆఫీసు తడిసి ముద్దవుతుంది. భవనం లోపలికి వెళ్లే ద్వారం సైతం శిథిలావ్థకు చేరింది. భవనం ఎప్పుడు పెచ్చులూడి ఖాతాదారుల మీద పడుతుందోనని భయపడుతున్నారు. దీంతో బ్యాంకకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అద్దె భవనంలో ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకును వేరే ప్రాంతానికి తరలించాలని ఖాతాదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా బ్యాంక్ అధికారులు స్పందించి శిథిలావ్థలో ఉన్న భవనాన్ని మార్చి వేరొక భవనంలోకి బ్యాంకును మార్చాలని కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన బ్యాంకు ఇదే

వేరొక భవనంలోకి మార్చుతాం

ఇండియన్ ఓవర్సస్ బ్యాంకును ప్రస్తుతం అద్దె భవనంలో నడుపుతున్నాం. ఇది శిథిలావస్థకు చేరిన విషయం వాస్తవమే. వేరొక భవనంలోకి మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. అద్దె భవనం వెతుకుతున్నాం. కొత్త భవనం దొరకగానే బ్యాంకును మార్చేస్తాం.

గిరజా శంకర్ సాహు, బ్యాంక్ మేనేజర్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

సుపరిపాలన కోరి ఓట్లు వేశారు

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి - చీపురుపల్లి

సుపరిపాలన కోసం ఆంధ్రరాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసారని టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లాల డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. ఆదివారం చీపురుపల్లిలోని ఆయన నివాశంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగార్జున మాట్లాడారు. ఎన్నికలలో ఓడిపోయిన తరువాత ఉనికి కోసం గ్రామ గ్రామాన తిరుగుతూ వైసిపి నాయకులు ఏవోవో మాట్లాడుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు సంక్షేమ పథకాలు ప్రకటించకపోయినా టిడిపి అధికారంలోనికి వచ్చేదని అన్నారు. సంక్షేమం కోసం కూటమికి ఓట్లు వేయలేదని, రాష్ట్రంలో శాంతిభద్రతల కోసం, జగన్‌మోహన్‌రెడ్డి చేసిన లిక్కర్ స్కాం, ఇసుక స్కాం, అరాచకాన్ని చూసి టిడిపికి ఓట్లు వేసారని, వైసిపి నాయకులు ఇది గుర్తించాలని అన్నారు. ఎన్నికల ముందు టిడిపి మేనిఫెస్టోని చూసి ప్రజలకు ఉపయోగపడు తుందని ఓట్లు వేసారని అన్నారు. రాష్ట్రంలో సంపద లేకపోయినా, ఆదాయ మార్గాలు లేకపోయినా చంద్రబాబునాయుడు తన మేదస్సుని ఉపయోగించి అన్ని చేస్తున్నారని అన్నారు. అధికారంలోనికి వచ్చిన ఏడాదిలోనే 80 శాతం హామీలు అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. వెయ్యి రూపాయలు పెన్షన్లు ఇవ్వడానికి ఏడాది పడితే చంద్రబాబునాయుడు ఒక్క సంతకంతోనే నాలుగు వేల రూపాయల పెన్షన్ ఇవ్వడం వాస్తవం కాదా అని అన్నారు. తల్లికి వందనం ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి ఇవ్వడం వాస్తవం కాదా అని, అన్న క్యాంటీన్లు పెట్టి సామాన్యునికి అన్నం పెట్టినది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇది అభివృద్ధి కాదా అని అన్నారు. రాష్ట్రంలో చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూడలేక ఉనికి కోసం ప్రజలలోనికి వెళ్లి ఏదో చెప్పాలని వైసిపి నాయకులు చూస్తున్నారని ప్రజలు అవి నమ్మే పరిస్థితుల్లో లేరని నాగార్జున అన్నారు.

మెడకు ఉరితాళ్లతో వినూత్న నిరసన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిందాల్‌కి భూములు ఇచ్చి మోసపోయిన గిరిజన, దళిత రైతులు ఆదివారం ఉరి తాళ్లు మెడకు వేసుకుని వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడుతూ 45 రోజులగా నిర్వాసితులు తమ భూములను తమకు ఇప్పించాలని నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం, జిందాల్ యాజమాన్యం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. జిందాల్ కంపెనీ కడతామని భూములు తీసుకుని ఇప్పుడు వాటిని రియల్ ఎస్టేట్ చేయడానికి సిద్ధపడటం దారుణమన్నారు. కంపెనీ కడితే ఉద్యోగాలు వస్తాయని తమ దగ్గర ఉన్న భూములు సర్వం ఇచ్చేసి గిరిజనులు కూలీలుగా మారారన్నారు. కంపెనీ లేక ఉద్యోగం లేక కంపెనీలో వాటా లేక కళ్ళముందే వేరే ఒకరికి భూమి బదలాయిస్తుంటే పోరాటమే శరణ్యమని రోడ్డు మీదకు వస్తే పోలీసు నిర్బంధంతో రోడ్డు మీద కూడా రానివ్వకపోవడం విచారకరమన్నారు. మొత్తం భూమి కోల్పోయిన గిరిజన దళిత రైతులకు చావు తప్ప వేరే మార్గం కనిపించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిందాల్‌తో రైతులు చేసుకున్న ఒప్పందాలను అమలు చేసేటట్టు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిందాల్ బాధితులు పాల్గొన్నారు.


మెడకు ఉరి వేసుకుని నిరసన తెలుపుతున్న బాధితులు

రైతులకు అందుబాటులో ఉండాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుర్ల

రైతులకు అందుబాటులో ఉంటు సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. ఆదివారం తెట్టంగి పిఎసిఎస్ ఛైర్మన్‌గా తిరుమలరాజు కిరణ్ కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తారని వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలన్నారు. రైతులు సొసైటీలలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సొసైటీని మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలోని ఉన్నతమైన స్థాయికి తీసుకురావాలన్నారు. డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున మాట్లాడుతూ రైతులకు టిడిపి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షులు రాజేష్‌వర్మ మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజలకు రైతులకు సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి టిడిపి కెటిఆర్, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి వెన్ని సన్యాసినాయుడు, టిడిపి గుర్ల, గరివిడి, మెరకముడిదాం, చీపురుపల్లి మండల అధ్యక్షులు సిహెచ్ మహేశ్వరరావు, సురేష్, సన్యాసినాయుడు, కామునాయుడు, పైల బలరాం, సొసైటీ అధ్యక్షులు తాడి చంద్రశేఖర్, పిల్ల అప్పలనాయుడు, దాసరి శివప్రసాద్, సిఇఒ రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

సిఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. గంట్యాడ మండలం రేగుబిల్లి గ్రామానికి చెందిన కంచి పద్మావతికి రూ.1,16,414, గజపతినగరం మండలం ఎం.కొత్తవలస గ్రామానికి చెందిన పట్నాన సురేష్ కుమారుడు సూర్య సాత్విక్ రూ.48,401 విలువైన చెక్కులను అందజేశారు.

ఉత్సాహంగా జిల్లా చదరంగం పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక కొత్త అగ్రహారంలోని సుజాత జూనియర్ కాలేజీలో శ్రీ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-19 చెస్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. 120 మందికి పైగా క్రీడాకారులు జిల్లా వ్యాప్తంగా హాజరయ్యారు. విజేతలకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.ఎ.రావు, సిఐ మంగవేణి బహుమతులు అందజేశారు.

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

బైకులు, ఆటో, బొలేరో ధ్వంసం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలోని ఆరికతోట జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పలు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. విజయనగరం నుంచి ఒడిషా వైపు వెళుతున్న లారీని పక్కకు తీసి నిలుపుదల చేసి డ్రైవర్ టిఫిన్ చేసేందుకు వెళ్ళగా లారీ ఒక్కసారిగా ముందుకు వెళ్లడంతో ఈ ప్రమాదం సంభవించింది. ముందుగా బొలేరో వాహనాన్ని ఢీకొనడంతో ఆ బొలేరో పక్కనే ఉన్న గోతిలో పడింది. టిఫిన్ షాప్ ముందు నిలుచున్న కొబ్బరి బొండాల ఆటోను కూడా లారీ ఢీకొనడంతో కొబ్బరిబొండాల ఆటో ఒక్కసారిగా టిఫిన్ కోట్టులోకి వెళ్లిపోయి లోపల ఉన్న వస్తువులను పూర్తిగా ధ్వంసం చేసింది. మరికొంత దూరం తరువాత ఆగి ఉన్న 3 బైకులను కూడా ఈ లారీ ఢీకొట్టి ఎదురుగా ఉన్న మరో ఆటోను ఢీకొట్టి నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో రెండు బైకులు లారీ కింద ఉండిపోయి ఒక బైకు నుజ్జునుజ్జు అయింది. ఈ రోడ్డు ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అక్కడ ఉన్నవారంతా ఊపిరిపీల్చు కున్నారు. ఆరికతోటకు చెందిన యజ్జల భాస్కరరావుకు చెందిన ఆటోతోపాటు టీ కొట్టులో ఉన్న సామాన్లు మొత్తం ధ్వంసమయ్యాయి. మొక్కజొన్న లోడుకోసం వచ్చిన బొలేరో వాహనం కూడా బోల్తాపడింది. మండల పరిధిలోని దుప్పలపూడి గ్రామానికి చెందిన చిప్పాడ రవితోపాటు మరో వ్యక్తి బైకు కూడా ఈ ప్రమాదంలో నుజ్జునుజ్జయ్యాయి. లారీ డ్రైవర్ అజాగ్రత్త వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఎన్‌కెఆర్‌పురం సమీపంలో రైవాడ నీటి కాలువ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం ఉదయం మృతి చెందారు. అనకాపల్లి జిల్లాకు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. దర్యాప్తు నిర్వహిస్తున్నామని రూరల్ సిఐ అప్పలనాయుడు తెలిపారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని డిఆర్‌పేట మార్గం నుంచి ఆటోపై పిడిఎస్ బియ్యం 350 కేజీలను తరలిస్తుండగా వల్లంపూడి కూడలి వద్ద గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో పట్టుకున్నామని వల్లంపూడి ఎస్ఐ సుదర్శన్‌రావు తెలిపారు. ఈ బియ్యాన్ని సోమవారం ఉదయం సిఎస్‌డిటికి అప్పగిస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలోని కొట్టక్కి జాతీయ రహదారి వద్ద నేరెళ్లవలస గ్రామానికి చెందిన కుడుమూరు కన్నయ్యదొర (26) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం రాత్రి పని ముగించుకొని రామభద్రపురం నుంచి ఇంటికి బైకుపై వెళుతుండగా మార్గమధ్యంలో బైకు అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. ఆదివారం ఉదయం అటువైపు వాకింగ్‌కు వెళుతున్న కొంత మంది చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారని అన్నారు. మృతునికి భార్య భవానీతోపాటు పిల్లలు అజిత్ కుమార్, సోను ఉన్నారని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్ధం నిమిత్తం బాడంగి సిహెచ్‌సికి తరలించి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కూలి పని చేసుకొని జీవనం సాగిస్తున్న వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.